క్లుప్తంగా

మున్సిపాలిటీలో కంట్రోల్ రూం ఏర్పాటు

నల్లగొండ టూటౌన్ : వర్షాల నేపథ్యంలో నీలగిరి మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ మాట్లాడుతూ 24 గంటలపాటు కంట్రోల్ రూం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఆరుగురు అధికారులు, 22 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారీ వర్షాలకు ఎక్కడ అత్యవసర పరిస్థితి ఏర్పడినా వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబర్ 08682-220100 ను సంప్రదించాలన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

నల్లగొండ టూటౌన్ : చెన్నైలో ఈనెల 28 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు జరగనున్న హాకీ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలుర పోటీలకు నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన క్రీడాకారులు కుంచం రాకేష్, గోగుల అఖిల్ ఎంపికయ్యారు. కుంచం రాకేష్ తెలంగాణ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్లు హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస్‌రెడ్డి, ఇమామ్ కరీం తెలిపారు.

ఇంటర్వ్యూలు వాయిదా

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీలో ఈ నెల 28న జరగాల్సిన గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు. సోమవారం సీఎస్ఐఆర్ నెట్ పరీక్ష ఉన్నందున.. 29వ తేదీన గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రికార్డుల పరిశీలన

చిట్యాల: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి శనివారం రికార్డులు పరిశీలించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ జి.కృష్ణనాయక్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ విజయ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

శాలిగౌరారం : మండలంలోని బైరవునిబండ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ కంటి ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శనివారం క్లబ్ జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దండ రేణుక అశోక్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు గుజిలాల్ శేఖర్, ప్రతినిధులు దామెర్ల శ్రీనివాస్, ఎర్ర శంభులింగారెడ్డి, డెంకల సత్యనారాయణ, కప్పల శ్రీకాంత్, వీరేంద్రచారి, స్థానిక నాయకులు ఈదులకంటి వెంకటయ్య, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్ల పంపిణీ


పెన్షన్ అందజేస్తున్న సెర్ప్ డైరెక్టర్ గోవర్ధన్

నార్కట్‌పల్లి : ఆసరా పెన్షన్‌లను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ గోవర్ధన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆసరా పెన్షన్ల ఫేస్ రికగ్నేషన్ యాప్‌ను నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. శనివారం ఫేస్ రికగ్నేషన్ యాప్ ద్వారా పెన్షన్లను శనివారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమేష్, పోస్టల్ శాఖ ఎస్పీ రఘునాథస్వామి, పంచాయతీ కార్యదర్శి ఎలంధర్‌రెడ్డి బీపీఎం దిలీప్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి విద్యా శిక్షణకు నవీన్‌రెడ్డి ఎంపిక


నవీన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంఈఓ నాగయ్య

నకిరేకల్: నూతన విద్యా విధానం (ఎన్ఈసీ-2029)లో భాగంగా బోధన- అభ్యర్ధన పద్ధతులను సృజనాత్మకంగా మార్చేందుకు ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి విద్యాశిక్షణ కార్యక్రమానికి నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం కనుకుంట్ల నవీన్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 10 వరకు రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో ఉన్న సెంట్రల్ కాంప్లెక్స్ రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో జరగనున్న 15 రోజుల కార్యక్రమానికి తెలంగాణ నుంచి మొత్తం 10 మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా.. వీరిలో చందంపల్లి పాఠశాల నుంచి నవీన్‌రెడ్డి ఉన్నారు. ఈయనను డీఈఓ భిక్షపతి, స్థానిక ఎంఈఓ మేక నాగయ్య, నోములు జెడ్పీ హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మిర్యాల చల్మరాజు అభినందించి సన్మానించారు.

ఆదర్శ పాఠశాలలో వంట తంటా

- ఆరుబయటే మధ్యాహ్న భోజనం వండుతున్న ఏజెన్సీ నిర్వాహకులు
- వర్షాకాలంలో వంట చేసేందుకు తీవ్ర ఇబ్బందులు
- ప్రత్యేక గది నిర్మించాలని వేడుకోలు


కొర్లపహాడ్‌లోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల


ఆదర్శ పాఠశాలలో ఆరు బయట వంట చేస్తున్న మహిళలు

కేతేపల్లి: ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి అన్ని హంగులతో నిర్మించిన ఆదర్శ పాఠశాలలో వంటగది మాత్రం నిర్మాణానికి నోచుకోవడం లేదు. నకిరేకల్ నియోజకవర్గం మొత్తంమీద కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో మాత్రమే ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ఉంది. పదేళ్ల క్రితం రూ.3 కోట్లతో సువిశాలమైన గదులతో పాఠశాల భవనం నిర్మించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు సుశిక్షితులైన ఉపాధ్యాయులను నియమించారు. ఇంతవరకు బాగానే ఉన్నా విద్యార్థులకు మధ్యాహ్న భోజన వంట చేసేందుకు సాంకేతికంగా వంటగది మంజూరు కాలేదు. దీంతో ఏళ్ల తరబడి మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆరుబయట పందిరి కిందనే వంటలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

తాటి కమ్మల చాటున వంట..

కొర్లపహాడ్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు దాదాపు 400 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాల గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేందుకు గది లేకపోవడంతో తాత్కాలికంగా ఏజెన్సీ వారు ప్రహరీ పక్కన పాత బస్తాల పట్టా, తాటి కమ్మలతో చాటు ఏర్పాటు చేసుకున్నారు. వంట గది లేకపోవడంతో ఆరు బయట ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వంటలు చేయాల్సి వస్తోందని ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు కట్టెలు మండక భోజనం, కూరగాయలు సరిగ్గా ఉడకడం లేదు. దీంతోపాటు వంట చేసే సమయంలో కోతులు గుంపులుగా వచ్చి వంట సరుకులను ఎత్తుకెళ్తున్నాయి అడ్డుకోబోయిన వంట చేసే మహిళలపై దాడి చేస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పాఠశాలలో వంటగది నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వంట ఏజెన్సీ మహిళలు కోరుతున్నారు.

వంట గది నిర్మించాలి



పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేందుకు వంట గది లేదు. ప్రహరీ పక్కన గోనె పట్టాలు, తాటి కమ్మలు అడ్డుగా పెట్టుకుని ఆరు బయటనే వంటలు చేస్తున్నాం. వర్షాలు వచ్చినపుడు మా బాధలు చెప్పనలవి కాదు. అధికారుల స్పందించి నిధులు మంజూరు చేసి పాఠశాలలో వంటగది నిర్మించాలి.

– బయ్య సైదమ్మ, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



పాఠశాలలో వంటగది నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండల అధికారులను కోరాం. నిధుల కొరతతో సమస్య పరిష్కారం కాలేదు. వంట గది లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కలెక్టర్‌ను కలిసి వివరిస్తాం. ప్రభుత్వం త్వరగా నిధులు మంజూరు చేసేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

– మమత, పాఠశాల ప్రిన్సిపాల్

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి


అశోక్‌గౌడ్‌ను సన్మానిస్తున్న లీగల్ సెల్ సభ్యులు

నల్లగొండ: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ అన్నారు. శనివారం నల్లగొండలోని రెవెన్యూ అతిథి గృహంలో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాంపల్లి నరసింహ అధ్యక్షతన జరిగిన లీగల్ సెల్ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా పదవులు పొందిన న్యాయవాదులు పార్టీ కార్యకర్తలకు న్యాయ సహాయం అందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సహకారంతో పీపీలు అయిన వారు కార్యకర్తలకు సమస్యలు వచ్చినప్పుడు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పొన్నం అశోక్‌గౌడ్‌ను జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు, న్యాయవాది నాంపల్లి భాగ్య, ఏజీపీలు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, వీరయ్య, న్యాయవాదులు నామిరెడ్డి మోహన్‌రెడ్డి, మెమీన్ రోషన్ జమీర్, ఉమాశంకర్, మేడ మోహన్ రెడ్డి, నఫీస్ ఫాతిమా, చక్రవర్తి, పాశం నరేష్‌రెడ్డి, మామిడి శ్రీను, వెంకటేశ్వర్‌రెడ్డి, దేవా, భిక్షపతిగౌడ్, రాజకుమార్, పొన్నం రవీందర్, రత్నారెడ్డి, లుక్మాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు ఇవ్వాలి

నల్లగొండ టౌన్: లాటరీ ద్వారా ఎంపికైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను వెంటనే ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ.సలీం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నల్లగొండ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సీపీఎం సమావేశంలో వారు మాట్లాడారు. 2023 జూలైలో పట్టణంలో 3,000 మంది ఇళ్లు లేని పేదలను విచారణ చేసి అర్హుల జాబితా రూపొందించి లాటరీ ద్వారా 552 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. కానీ నేటికీ వారికి ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వలేదన్నారు. ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని ఈ నెల 30న తహసీల్దార్ ఆర్డీఓలకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. అవుట రవీందర్, గంజి రాజేష్, కీసరి ప్రశాంతి, సిరాజుద్దీన్, విజయలక్ష్మి, విశాలాక్షి గౌసియా, రవీంద్రచారి, వెంకటమ్మ పాల్గొన్నారు.

కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం ఆవిష్కరణ


కల్నల్ సంతోష్‌బాబు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తల్లిదండ్రులు

రామగిరి(నల్లగొండ): చైనా సైనికులతో సరిహద్దులో వీరోచిత పోరాటం చేసి 2020 సంవత్సరంలో వీర మరణం పొందిన కల్నల్ సంతోష్‌బాబు విగ్రహాన్ని పాతబస్తీ ఆర్య సమాజ్ జై జవాన్ శిక్షణ కేంద్రంలో ఏర్పాటుచేశారు. కార్గిల్ దివస్ సందర్భంగా దాత ఈగ దయాకర్ గుప్తా ఏర్పాటు చేసిన సంతోష్‌బాబు విగ్రహాన్ని శనివారం సంతోష్‌బాబు తల్లిదండ్రులు బిక్కుమళ్ల ఉపేందర్ మంజుల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతోష్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కల్నల్ సంతోష్ తల్లిదండ్రులకు శిక్షణ కేంద్రం నిర్వాహకుడు కొండోజు సత్యనారాయణ పుష్పాలతో పాదపూజ చేసి జాతీయ పతాకాన్ని అందజేసి సత్కరించారు. సంతోష్‌బాబు తండ్రి ఉపేందర్ మాట్లాడుతూ యువత సైన్యంలో చేరి దేశ రక్షణకు పాటుపడాలన్నారు. తన కుమారుడి సాహసాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పరమవీరచక్ర బిరుదు ఇవ్వడం తమ కుటుంబానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కూరెళ్లి శ్రీనివాసాచారి సైనిక శిక్షణ పొందుతున్న యువతీ యువకులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు కాలయాపన తగదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ టౌన్: స్థానిక సంస్థల ఎన్నికలు జరపకుండా ప్రభుత్వాలు కాలయాపన చేయడం తగదని సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల గడువు పూర్తయి రెండు సంవత్సరాలు కావొస్తున్నా ఎందుకు ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి కేంద్ర ప్రభుత్వం వద్దకు ప్రతినిధుల బృందాన్ని తీసుకెళ్లి రిప్రజెంటేషన్ చేయాలన్నారు. రాష్ట్ర కేబినెట్ సమావేశంలో స్థానిక ఎన్నికలు ఎప్పటిలోగా నిర్వహిస్తారో స్పష్టంగా ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి అయిలయ్య, డి.మల్లేషం, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, సయ్యద్ హాశం, పాలడుగు ప్రభావతి, చిన్నపాక లక్ష్మీనారాయణ, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భూ తగాదాలో పలువురికి గాయాలు

నాంపల్లి: భూ తగాదాలో పలువురు రైతులకు గాయాలైన ఘటన నాంపల్లి మండలంలోని నేరళ్లపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలంలోని నేరెళ్లపల్లి గ్రామంలో కొంతకాలంగా ముక్కామల సత్తయ్య కుటుంబానికి శివర్ల నరసింహ, శివర్ల సైదులు కుటుంబాల మధ్య భూ తగాధ నడుస్తోంది. సైదులు, నర్సింహ పొలంలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా సత్తయ్య తమ కుటుంబ సభ్యులతో కలిసి గొడవకు దిగాడు. ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. దాడిలో ఇద్దరు మహిళలు, ఆరుగురు మగవారి తలలకు గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి వారిని అడ్డుకున్నారు. తీవ్ర గాయాలైనవారిని మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శనివారం ఉదయం సమాచారం తెలిసిన స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బీజేపీ జెండా ఎగురవేయాలి

గట్టుప్పల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టుప్పల్ మండలంలో బీజేపీ జెండా ఎగురవేయాలని బీజేపీ ఎన్నికల ప్రభారి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గట్టుప్పల్‌లో శనివారం జరిగిన పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు రావుల ఎల్లప్ప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చిలువేరు దుర్గయ్య, కంపె దుర్గయ్య, నాగులగాని శ్రీనివాసులు, ఇడెం రాజు, సుధాకర్, మార్కండేయ, పరమేశం, విష్ణు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న రవినాయక్

మునుగోడు: గంజాయి, మత్తు పదార్థాలు, బెట్టింగ్‌లకు యువత దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్ కోరారు. గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్‌లను అరికట్టాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ చైతన్య సైకిల్ యాత్ర శనివారం మునుగోడుకు చేరుకుంది. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ రోజురోజుకూ గంజాయి వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోతోందని, ఆన్‌లైన్ బెట్టింగుల్లో యువత లక్షల రూపాయలు పోగొట్టుకుని అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. వాటిని పూర్తిగా నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అందుకు తల్లిదండ్రుల సహాయ సహకారాలు ఉండాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పుల్లెంల శ్రీకర్, వడ్డగోని మహేష్, గుండాల నరేష్, రాజేష్, చంద్రశేఖర్, గోపి, నరేష్, శ్రీకాంత్, సాయితేజ, చరణ్, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ బెల్లి జనార్దన్

నకిరేకల్ : విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని సినీ నటుడు, నిర్మాత, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ బెల్లి జనార్దన్ సూచించారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అపజయాలు.. విజయానికి సోపానాలు యువ వికాస్ సదస్సులో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. యువత, విద్యార్థులు డ్రగ్స్, మద్యం, ధూమపానం లాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకూడదని సూచించారు. వాటి వల్ల కలిగే నష్టాలను ఆయన ఎల్ఈడీ స్క్రీన్‌పై విద్యార్థులకు వివరించారు. క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ మేక నాగయ్య, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, ప్రోగాం చైర్మన్, ట్రస్మా నకిరేకల్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర శంభులింగారెడ్డి, కార్యదర్శి కన్నయ్యగౌడ్, ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ యానాల మోహన్‌రెడ్డి, రీజియన్ చైర్మన్ సంతోష్‌కుమార్, జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు, ట్రస్ట్ చైర్మన్ ఎన్.రాంమోహన్‌రావు, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి


కనగల్ : మొక్క నాటుతున్న ఎస్ఐ రాజీవ్‌రెడ్డి

కనగల్: మొక్కలు నాటి సంరక్షించాలని కనగల్ ఎస్ఐ కె.రాజీవ్‌రెడ్డి అన్నారు. శనివారం కనగల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన యువకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఐదు మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో యువకులు కొరివి శ్రీనివాస్, పర్సనబోయిన స్వామి, ఏర్పుల స్వాతిరామ్, బొమ్మకంటి లింగస్వామి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలి

చండూరు : ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు పెంచాలని ఎంపీడీఓ బండారు యాదగిరి అన్నారు. బంగారిగడ్డ జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో శనివారం ఆయన మొక్కలు నాటిన అనంతరం మాట్లాడారు. మొక్కలను నాటడమే కాకుండా పెంచి పెద్ద చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామలింగయ్య, మాదగోని వెంకటేశం, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి కోటయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


షూ, టై, బెల్టులతో విద్యార్థులు

మునుగోడు: పేదలకు లయన్స్ క్లబ్ నల్లగొండ ఎలైట్ అందిస్తున్న సామాజిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ మదన్‌మోహన్ అన్నారు. మునుగోడు ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 200 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఎలైట్ నల్లగొండ సభ్యులు అందించిన షూ, టై, బెల్టులు, ఐడీ కార్డులను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లేషం, పాఠశాల ఎచ్ఎం, సుంకరి భిక్షంగౌడ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు యూసుఫ్ పాష, కార్యదర్శి మేకల అన్నపురెడ్డి, జనగాం వెంకన్న గౌడ్, కళావతి, లయన్స్‌క్లబ్ సభ్యులు అద్దంకి సునీల్, మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, రాంబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నల్లగొండ టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ డిమాండ్ చేశారు. నల్లగొండలో శనివారం ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచడం లేదని, పెన్షన్లు పెంచాలని ప్రభుత్వాన్ని ప్రతిపక్షం అడగడం లేదని విమర్శించారు. పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 1న మిర్యాలగూడలో వికలాంగులు, చేయూత పెన్షన్‌దారుల జిల్లా సన్నాహక సభ నిర్వహించనున్నామన్నారు.ఈ సమావేశంలో మాసారం వెంకన్న, జానకిరామయ్య చౌదరి, గాదె రమేష్, ఇరిగి శ్రీశైలం, కురుపాటి కమలమ్మ, కొత్త వెంకన్నయాదవ్, ఊదరి నవీన్, నక్కా అశోక్, మేడబోయిన నగేష్, కట్ట యాదయ్య, గడ్డం ఉపేందర్, తుమ్మల లక్ష్మారెడ్డి, మదన్‌నాయక్, బొజ్జ బన్నీ తదితరులు పాల్గొన్నారు.

బాలల గేయాల పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని విడుదల చేస్తున్న ఎంఈఓ నాగయ్య

నకిరేకల్: బాల సాహిత్యం చదవడం వల్ల విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందుతాయని నకిరేకల్ ఎంఈఓ మేక నాగయ్య అన్నారు. నకిరేకల్ మండలం తాటికల్ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం కవి, ప్రముఖ బాల సాహితీవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రచించిన ఊగుతున్న ఉయ్యాల బాలల గేయాల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న, పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్, మార్త రాములు, సాగర్ల సత్తయ్య, నర్రా వెంకట్ రెడ్డి, లొట్లపల్లి కోటయ్య, నూకల జానయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

కట్టంగూర్ : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్, ఎంఈఓ అంబటి అంజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో ఓపెన్ టెన్త్‌కు, టెన్త్ ఉత్తీర్ణత పొందిన వారు ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 31 వరకు ఫీజు చెల్లించి కట్టంగూర్ హైస్కూల్‌లో గల ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు పొందాలన్నారు.

టీవీ బహూకరణ

చిట్యాల: నేరడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు రంగా రామలింగయ్య శనివారం టీవీని అందజేయగా ఎంఈఓ పానుగోతు సైదానాయక్ ప్రారంభించారు. అనంతరం ఆ గ్రామానికి చెందిన జంపాల గోపాల్ సమకూర్చిన టై, బెల్ట్‌లను విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు వల్లం నాగరాజు, ఉపాధ్యాయులు పి.హేమలత, రంగా రామలింగయ్య, పోషం లింగస్వామి, సుమలత పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

నకిరేకల్ : పట్టణంలోని సాయి కల్యాణ మండపంలో విద్యార్థులకు నకిరేకల్ లయన్స్ సెంటినియల్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంద్రజాల ప్రదర్శన నిర్వహించారు. మెజీషియన్, మోటివేషనల్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ స్పీకర్ జి.రామకృష్ణ ఇంద్రజాల ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. మూఢనమ్మకాలు, సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం రామకృష్ణను క్లబ్ సభ్యులు సత్కరించారు. క్లబ్ మాజీ జోన్ చైర్మన్ రావిరాల అశోక్, క్లబ్ అధ్యక్షుడు కందాల ప్రేమ్‌నాథ్‌రెడ్డి, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రైతులందరికీ కిసాన్ సమ్మాన్ నిధి వర్తింపజేయాలి

కేతేపల్లి: భూమి ఉన్న రైతులందరికీ కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వర్తింపజేయాలని టీపీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నా పెట్టుబడిసాయం అందరికీ అందడం లేదన్నారు. 2019 తర్వాత పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

సైనికుల పోరాటానికి విజయ్ దివస్ నిదర్శనం


ఎన్జీ కళాశాల నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

రామగిరి(నల్లగొండ): కార్గిల్ యుద్ధంలో సైనికుల విరోచిత పోరాటానికి నిదర్శనమే విజయ్ దివస్ అని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. విజయ దివస్ సందర్భంగా దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమర వీరులకు ఎన్జీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు శనివారం ఘనంగా నివాళులర్పించారు. కాలేజీ నుంచి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారత జవాన్లు ప్రదర్శించిన ధైర్యం, త్యాగం విద్యార్థులకు ప్రేరణగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి సీహెచ్.సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు సరికాదు

గట్టుప్పల్ : కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తొలగించడం సరైన విధానం కాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాధం అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఫ్లెక్సీలను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి ఫిర్యాదు చేశామన్నారు. బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీల తొలగింపునకు తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో నామని బుచ్చయ్య, భీమగాని మల్లేశం, చెరుపల్లి ఆంజనేయులు, రావుల పర్వతాలు, బండారి అంజయ్య, పగిళ యాదయ్య, చెరుపల్లి సత్తయ్య, బాల్ రెడ్డి, పగిళ్ళ శంకరయ్య, వెంకటేశం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం నిర్ణయించే వరకు పోరాడుతాం

నల్లగొండ టూటౌన్ : మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించే వరకు పోరాటం చేస్తామని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నల్ల గొండ పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీం అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయం ఎదుట ధర్నాకు మున్సిపల్ కార్మికులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్ రవీందర్, యూనియన్ జిల్లా కార్యదర్శి జక్కుల రవికుమార్, పట్టణ కార్యదర్శి పెరిక కృష్ణ, పేర్ల సంజీవ, కత్తుల పద్మ, రాములు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నాకు వెళ్లారు.

డీఎస్పీ విచారణ

శాలిగౌరారం : మండలంలోని అడ్లూరు గ్రామంలో శనివారం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ చేపట్టారు. అడ్లూరు గ్రామానికి జెట్టి వెంకటయ్య అతడి కుమారుడు రామకృష్ణ తనపై దాడి చేసి దూషించారని ఆరోపిస్తూ అదే గ్రామానికి చెందిన కడమంచి మహేందర్ శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు డీఎస్పీ శివరాంరెడ్డి విచారణ చేశారు. ఆయన వెంట ఎస్ఐ సైదులు ఉన్నారు.


విచారణ చేస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి